


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూలై 31, 2026 | సంపుటి : 2 | సంచిక : 289 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

## కార్పోరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి

- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూలై30 :**

తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు

మిగతాద్ది 2 లో

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత



2 లో

**హైదరాబాద్,జూలై30 :**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



2లో..

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై30 :**

పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు.

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

» అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
» జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
» అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,జూలై30:**

అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

మిగతాది 2లో

# వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

## అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన



2లో..

**హైదరాబాద్,జూలై30 :**

తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు.



2లో..

# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

- రిజర్వాయర్‌లను నింపాలనే సోయి రాకపోతే ఎలా
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**హైదరాబాద్,జూలై30 :**

గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి..



# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

2 లో

## ఫార్ములా ఈ-రేస్ కేసు.

# కోర్టుకు కేటీఆర్ హాజరు



**హైదరాబాద్:**

ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారానికి సంబంధించిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుకానున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు కేటీఆర్ వ్యక్తిగతంగా హాజరుకానున్నారు.ఫార్ములా ఈ-రేసు నిర్వహణలో నిధుల వినియోగం, పరిపాలనా నిర్ణయాలకు సంబంధించిన అంశాలపై ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో కోర్టు ముందు విచారణ జరగనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కేటీఆర్ హాజరు అనంతరం కోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.



# ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

- అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి
- ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు

**హైదరాబాద్,జూలై30(ఆర్ఎన్ఎ):**

రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం,

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు
- అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,జూలై30 :**

వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

మిగతాది 2లో

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷–లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగుతుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు,

పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷–లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదేమీ లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.మీ. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం.మీ, బెజ్జూరులో 14, సెం.మీ., కన్నాయిగూడెంలో 13 సెం.మీ., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.మీ., నస్పూర్ 11.8 సెం.మీ. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.మీ., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.మీ., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.మీ., సిర్పూర్(టి)లో 10.5 సెం.మీ., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

మొదటిపేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷–లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

మొదటిపేజీ తరువాయి

ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చుని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?‘ అని ఎవరైనా అడిగితే, ‘తెలంగాణ సీఎం అవుతాను‘ అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్ధవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణెళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి

అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

మొదటిపేజీ తరువాయి

ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన

పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

మొదటిపేజీ తరువాయి

అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45–50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఎ÷–లో ఎంత ఉందో అవుట్ ఎ÷–లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి

మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ÷ుక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# త్రిబుల్ ఐటీ లో స్పోర్ట్స్ కోటాలో క్రీడా పాఠశాల విద్యార్థినికి ప్రవేశం



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**

కరీంనగర్ లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదివిన వలస ప్రసన్న లక్ష్మి స్పోర్ట్స్ కోటా క్రింద యోగ క్రీడాంశంలో బాసరలోని త్రిబుల్ ఐటీ లో ప్రవేశం పొందినట్టు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగిరెడ్డి సిద్దారెడ్డి , గుంటి రామకృష్ణ లు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లికి చెందిన వలస నాగయ్య గౌతమి దంపతుల కుమార్తె ప్రసన్న లక్ష్మి 2019లో కరీంనగర్ లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం పొంది యోగా క్రీడాంశంలో జిల్లా నుండి పలు జాతీయస్థాయి యోగా పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి ఈ సంవత్సరం త్రిబుల్ ఐటీ లో స్పోర్ట్స్ కోటా క్రింద సీట్ పొందినట్లు వారు తెలిపారు. గత సంవత్సరం జాతీయ స్థాయి జూనియర్స్ విభాగంలో మరియు పాఠశాలల జాతీయ స్థాయి యోగా పోటీలలో పాల్గొని 100 మంది క్రీడాకారులలో ఐదవ స్థానంలో స్పోర్ట్స్ కోటా క్రింద సీటు సాధించినట్టుగా తెలిపారు. ప్రసన్న లక్ష్మి ఎంపిక పట్ల జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్, ప్రాంతీయ క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ కే. శ్రీనివాస్ యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జె. మనోహర్ కుమార్, రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కోశాధికారి పి. స్వరూప చారి, యోగ కోచులు వావిలాల కిష్టయ్య, పి. మల్లేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, కోచులు, కార్యవర్గ సభ్యులు సిహెచ్. ప్రశాంత్, ఏ. ఆనందకిషోర్, కె. సంతోష్ , పుష్పలత , జోష్ణ , ప్రవళిక తదితరులు అభినందించారు

# పాల ఉత్పత్తిలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి, ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి

**కరపత్రం ప్రతినిది, భీమదేవరపల్లి**



రైతులు పాల ఉత్పత్తిలో ఆధునిక శాస్త్రీయ పద్ధతులు పాటించాలని ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ నందు పాడి పశువుల సంరక్షణ, పాల ఉత్పాదకత పెంపుపై రైతులకు అవగాహన సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ పాల ఉత్పత్తిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. రైతులు కాలానుగుణంగా ఎప్పటికప్పుడు శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధాకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్ రెడ్డి, ముల్కనూర్ సహాయ సంచాలకులు డాక్టర్ రఘుబాబు, జిఎం రామ్ రెడ్డి, స్థానిక పశు వైద్యులు, రైతులు పాల్గొన్నారు.

# వీఆర్ఆర్ రైస్ మిల్లుపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడకు చెందిన వీఆర్ఆర్ రైస్ మిల్లుపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ గురువారం కరీంనగర్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన 1,232.773 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అందజేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ అమలు పై కొనసాగుతున్న పెన్ డౌన్ కార్యక్రమం

స్టాంప్ వెండర్స్ జేఏసీ జిల్లా చైర్మన్ షేక్ రషీద్ వెల్లడి



**కరపత్రం ప్రతినిధి గుంటూరు, జూలై 30 :**

గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పీపీపీ విధానాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్ ఈ నెల 20 నుంచి తలపెట్టిన పెన్ డౌన్ కార్యక్రమం కొనసాగుతోందని గుంటూరు రెవెన్యూ జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మునగాల రవీంద్రనాథ్, స్టాంప్ వెండర్స్ జేఏసీ జిల్లా చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు షేక్ రషీద్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న వారు ఈ సందర్భంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తమ సమస్య పరిష్కరించే లా కృషి చేయాలని వారు కోరారు. ప్రకటన పై గుంటూరు రెవెన్యూ జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం సభ్యులు పొట్టి గోవర్ధన్, తన్నీరు సురేష్ కుమార్, దాసరి బాల స్వామి, విష్ణువర్ధన్, చక్రవర్తి, సీనియర్ డాక్యుమెంట్ రైటర్స్ జక్కిరెడ్డి శంకర్ రెడ్డి, మహేష్ తదితరులు మద్దతు తెలిపారు.

# సివిల్ రైట్స్ డే సందర్భంగా విలాసాగర్‌లో గ్రామసభ..

పౌర హక్కుల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలి : తహశీల్దార్ గడ్డం సుధాకర్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 30**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో గురువారం (30-07-2026) సివిల్ రైట్స్ డే సందర్భంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, విధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, సామాజిక సమానత్వం, పారదర్శక పాలన వంటి అంశాలపై గ్రామస్థులకు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జమ్మికుంట తహశీల్దార్ గడ్డం సుధాకర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన రాజ్యాంగబద్ధమైన హక్కులను తెలుసుకోవడంతో పాటు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. హక్కులతో పాటు విధులను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామసభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారాలు చూపించే ప్రజాస్వామ్య వేదికలని వివరించారు. జమ్మికుంట ఎస్ఐ రవి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తే నేరాలను అరికట్టడం సులభమవుతుందని తెలిపారు. మహిళలు, యువత తమ హక్కులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గిర్దావర్-2 ఎన్. సత్యనారాయణ భూ సంబంధిత సేవలు, రెవెన్యూ వ్యవహారాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించగా, పంచాయతీ కార్యదర్శి బి. విష్ణుకుమార్ గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామ సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను



గ్రామసభలో చర్చించి వాటి పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామసభ అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లకు చీరల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి -కేశపట్నం, జూలై 30:**

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమని మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కేశపట్నం మండలంలో కొత్తగట్టు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గుంటి రాజయ్య తన తల్లిదండ్రులు గుంటి ఎల్లవ్వ--గోపయ్య స్మారకార్థం మండలంలోని 105 మంది మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు, స్కావెంజర్లకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఈ వయసులోనూ తల్లిదండ్రులను స్మరించుకుంటూ వారి పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ అవసరమైన వారికి అండగా నిలవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు విద్యార్థులకు తల్లుల్లా సేవలందిస్తున్నారని, తక్కువ పారితోషికంతోనూ ఎండవానలను లెక్కచేయకుండా వేడివేడి భోజనం అందిస్తూ పరిశుభ్రతను పాటిస్తున్నారని కొనియాడారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు తన వద్దకు వచ్చిన వెంటనే ఆమోదం తెలుపుతానని హామీ ఇచ్చారు. దాత గుంటి రాజయ్య మాట్లాడుతూ.. తన మిత్రుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని, స్వగ్రామం కొత్తగట్టు ఉన్న కేశపట్నం మండలంలోని వంట కార్మికులు, స్కావెంజర్లకు చీరలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.



కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జరీనా, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు, స్కావెంజర్లు పాల్గొన్నారు.

# కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం.

ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ దృష్టికి ఈటల రాజేందర్ పలు అంశాలు తీసుకువచ్చారు.

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ జూలై 30**

- తెలంగాణ రాష్ట్రంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు అవసరం ఉంది.
- ఇప్పటికి మంజూరు అయిన రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు
తొందరగా పూర్తిచేయాలని కోరారు.
- ఇంకా చాలా అవసరం ఉన్నాయి.. ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.. వాటిని కూడా మంజూరు చేయాలని కోరారు.
- హైదరాబాద్ నగరంలో గతంలో కంటే రైళ్ల వేగం, రైళ్ల ఫ్రీక్వెన్సీ బాగా పెరిగింది. అది గమనించక చాలా మంది ప్రజలు పట్టాలు క్రాస్ చేస్తూ రైలు ఆక్సిడెంట్ లో చనిపోతున్నారు. ఈ సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తున్న అంశం అని మంత్రి దృష్టి ఈటల రాజేందర్ తీసుకువచ్చారు.
- ఇందుకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని కోరారు.
- అవసరం ఉన్న ప్రతి చోట చిన్న చిన్న అండర్ పాస్ లు.. 9 - 10 అడుగుల ఎత్తులో సాధ్యమైనంత ఎక్కువ వెడల్పుతో నిర్మించాలని కోరారు. ఆటోలు, స్కూటర్లు, మనుషులు వెళ్ళడానికి వీలుగా ఉంటుందని సూచించారు.
- పట్టాలు తక్కువ ఎత్తులో ఉన్న చోట మనుషులు క్రాస్ చేయడానికి అనువుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జులు నిర్మాణం చేయాలని కోరారు.
- ఆక్సిడెంట్ జరగకుండా చూడడమే మనందరి అంతిమ లక్ష్యంగా ఉండాలని కోరారు- ఎంతో ఖర్చు పెట్టి రైల్వే అండర్ బ్రిడ్జిలు కట్టినా.. చాలాచోట్ల వాటికి ఇరువైపులా మూడు నుండి నాలుగు అడుగుల నీరు, వర్షాకాలంలో నిలిచిపోవడం వల్ల వాహనాల రాకపోకలు జరగక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇది ఒక్క తెలంగాణలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. దీనిని శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు..



# శ్రీ చైతన్య హై స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ

◆ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలే విజయానికి పునాది: ఓవీకే శాస్త్రి

**కరపత్రం ప్రతినిధి రామగుండం, జూలై 30:**

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శ్రీ చైతన్య హై స్కూల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణను పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శ్రీ ఓవీకే శాస్త్రి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే నాయకత్వ లక్షణాలు, నిజాయితీ, క్రమశిక్షణ, సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. బాధ్యతలు చేపట్టిన ప్రతి విద్యార్థి పాఠశాలకు ఆదర్శంగా నిలిచి ఇతరులకు స్ఫూర్తిగా ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, సామాజిక బాధ్యతలను అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ



సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్కూల్ క్యాబినెట్ సభ్యులకు బ్యాడ్జీలు, బాధ్యతల గుర్తులను అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులు తమ



బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్ రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ శైలజ, అధ్యాపక బృందం, విద్యార్థినీ--విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పీఈటీలు శృతి మరియు రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకర్షణీయమైన మార్చ్ పాస్ట్‌తో పాటు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు సభకు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

# భక్తి, అభివృద్ధి కలయికగా దక్షిణ కాశీ రూ.1.62 కోట్లతో తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ..






**గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం..వరుణయాగానికి శ్రీకారం**

**భీమేశ్వర ఆలయంలో మంత్రుల ప్రత్యేక పూజలు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలో గురువారం అభివృద్ధి కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు ఒకే వేదికపై ఆవిష్కృతమయ్యాయి. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బస్‌స్టేషన్ ఆధునీకరణకు శ్రీకారం**

వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రూ.1.62 కోట్లతో మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోందని, పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సులు, సిబ్బంది నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయ ప్రాంతాల్లో బస్‌స్టేషన్లను ఆధునీకరించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్ ఆధునీకరణ కూడా అభివృద్ధిలో కీలక ఘట్టమన్నారు.

**ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం**

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్నదాన సత్రం, రహదారి విస్తరణ, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి తదితర పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

**వరుణయాగానికి శ్రీకారం**

మంత్రులు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించే సత్వర సద్యఃసువృష్టి వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, సంతత ధారాభిషేకం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని, రైతులకు పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. **బండ్ పార్క్ ప్రారంభం** వేములవాడ గుడి చెరువులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన బండ్ పార్క్‌ను మంత్రులు ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన భారీ శివుడి విగ్రహం, నటరాజ స్వామి విగ్రహం, సప్తమాతృకల విగ్రహాలు, ఉద్యానవనాన్ని పరిశీలించారు. ఈ పార్క్ వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులకు కొత్త ఆకర్షణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ఎంపీ ఈటల రాజేందర్ -- తెలంగాణ అభివృద్ధి, రాజకీయాలపై కీలక చర్చ

**కరపత్రం ప్రతినిధి ఢిల్లీ, జూలై 30:**



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలతో పాటు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.సమావేశంలో ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు కేటాయించాలని ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. అలాగే కౌకూరు దర్గా నుంచి బిట్స్ పిలాని వరకు డిఫెన్స్ భూముల మీదుగా రహదారి నిర్మాణం, విస్తరణకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.డిఫెన్స్ పరిధిలో ఉన్న పలు రహదారులను విస్తరించడంతో పాటు సామాన్య ప్రజల రాకపోకలకు మరిన్ని మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని కూడా కేంద్ర రక్షణ మంత్రికి ఆయన వినతి చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు నగర అభివృద్ధికి కూడా ఎంతో ఉపయోగపడుతాయని వివరించారు.అలాగే ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణ పర్యటన, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి బలమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ సూచించినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కేంద్ర నాయకత్వం పూర్తి సహకారం, రాష్ట్ర నాయకుల సమన్వయం, కార్యకర్తల కృషితో రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసి కాషాయ జెండాను ఎగురవేస్తామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు తెలిపారు.

# ధ్యానంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం



◆ ధ్యాన గురువు చింత అనిల్‌కుమార్‌ను అభినందించిన బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్:**

ధ్యానం మనిషిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ధ్యాన గురువు చింత అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా ప్రజల్లో ధ్యానంపై అవగాహన కల్పిస్తూ సేవలందిస్తున్న ధ్యాన గురువు చింత అనిల్‌కుమార్‌ను, ఆయనకు సహకరిస్తున్న తాళ్లపల్లి రమేష్, క్యాస రవీందర్‌లను అభినందించారు.ధ్యానాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవాలని, "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను మరింత మందికి తెలియజేసి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు సందేల వెంకన్న, ఇప్పకాయల సాగర్, చిలుకమారి శ్రీనివాస్, మావునూరి ప్రవీణ్‌కుమార్, కొలిపాక క్రాంతి, చల్లూరి రఘుచారి, పంజాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బోధి పాఠశాలలో ఘనంగా స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు

**భవిష్యత్తు నాయకులను తయారు చేసే గొప్ప ప్రజాస్వామ్య వేదిక**

**విద్యార్థి నాయకత్వాన్ని, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకే ఎన్నికలు**

**కరపత్రం ప్రతినిధి పిడుగురాళ్ల, జూలై 30 :**













పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో విద్యార్థి నాయకత్వాన్ని, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే లక్ష్యంతో స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు గురువారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ఆయాలు, డ్రైవర్లు, క్లీనర్లు, సెక్యూరిటీ సిబ్బంది మరియు ఇతర నాన్-టీచింగ్ స్టాఫ్ అందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, క్రమశిక్షణతో సాగింది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మేడమ్ మాట్లాడుతూ,"దమా పాఠశాలలో జరిగే ఎన్నికలు కేవలం పోటీ కాదు అని అన్నారు. ఇది భవిష్యత్ నాయకులను తయారు చేసే గొప్ప ప్రజాస్వామ్య వేదిక అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి, ప్రజాస్వామ్య విలువలను పాటిస్తూ, క్రమశిక్షణతో ఈ ఎన్నికలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. గెలిచిన వారందరూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలి అన్నారు. ఓడిన వారు నిరుత్సాహ పడకుండా తదుపరి అవకాశాలకు సిద్ధంగా ఉండాలి అన్నారు. బోధి పాఠశాల కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందనడానికి ఈ ఎన్నికలు మరోసారి నిదర్శనంగా నిలిచాయి" అని తెలిపారు.

**బోధి పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ,**

"ప్రతి ఓటు విలువైనదే అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా యుతమైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి వంటి విలువలను పెంపొందించేందుకు ఇలాంటి ఎన్నికలు ఎంతో దోహదపడతాయి అన్నారు. ఎన్నికల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో తమ బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది. ఈ ఎన్నికలు విద్యార్థులకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని, బాధ్యతను మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఒక విలువైన అనుభవంగా నిలిచాయి.

# ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి.. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు


**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 30:**



ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటనపై జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు అరకాల భారతి (భర్త: కుమారస్వామి), స్వస్థలం కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామం, ప్రస్తుతం జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీలో నివాసం ఉంటున్నారు.ఈ నెల 29న ఆమె భర్త అరకాల కుమారస్వామి (50), తండ్రి రామచంద్రం, తన స్వగ్రామమైన భీంపల్లి వద్ద ఉన్న వ్యవసాయ భూమిని దున్నేందుకు సొంత ట్రాక్టర్‌తో వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో అంకుశాపూర్ గ్రామ శివారుకు చేరుకోగానే ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న వ్యవసాయ పొలంలో పల్టీలు కొట్టింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద చిక్కుకున్న కుమారస్వామికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మృతుడి భార్య అరకాల భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మికుంట పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి -- 4వ వార్డులో శానిటేషన్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 30:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న శానిటేషన్, డ్రైనేజీ నిర్వహణ పనులను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గురువారం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరదనీరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా వెళ్లేలా శానిటేషన్ సిబ్బంది చేపడుతున్న చర్యలను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ప్రజలు అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటిని తప్పనిసరిగా గోరువెచ్చగా చేసుకుని తాగాలని, ప్రతి కుటుంబం తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా సహకరించాలని, దోమల నివారణ చర్యలు పాటించాలని సూచించారు.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు మున్సిపల్ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరిస్తే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ఆయన తెలిపారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉండటం, డ్రైనేజీ సమస్యలు లేదా పారిశుద్ధ్య లోపాలు కనిపిస్తే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పోల్నేని అజయ్ రావు, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.